మహిళా ఉద్యోగులకు క్రీడలు

ములుగురూరల్, మార్చి 3 : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా ఉద్యోగులకు ఈ నెల 5,6 తేదీల్లో వివిధ విభాగాల్లో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు డీడబ్ల్యూవో శిరీష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో మహిళా ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

తల్లిదండ్రుల పోషణ పిల్లలదే

ములుగురూరల్, మార్చి 3 : వృద్ధాప్యంలో తల్లిదండ్రుల పోషణ కన్న బిడ్డలదేనని ఆర్డీవో వెంకటేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ములుగు మండలం దేవగిరిపట్నం గ్రామానికి చెందిన యక్కంటి వెంకట్‌రెడ్డి తన పెద్ద కొడుకు పుల్లారెడ్డి, కోడలు స్రవంతి ఇబ్బందులకు గురి చేస్తున్నారని గత నెల 25న దరఖాస్తు చేశారని పేర్కొన్నారు. కోడలికు గిఫ్ట్ రూపకంగా ఇచ్చిన వ్యవసాయ భూమిని సైతం తిరిగి తనకు ఇప్పించడంతో పాటు పోషణ ఖర్చులు అందజేసేలా చూడాలని ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టి, చట్ట ప్రకారం వెంకట్‌రెడ్డికి నెలకు రూ.10వేలు చెల్లించేలా ఆదేశించినట్లు తెలిపారు. సీనియర్ పౌరుల పోషణ సంక్షేమ చట్టం ప్రకారం నోటీసులు జారీ చేసి ఈ నెల 7న విచారణకు హాజరు కావాలని తహసీల్దార్ ద్వారా నోటీసులు అందజేసినట్లు తెలిపారు. వృద్ధాప్యంలో ఉండి పిల్లలు పట్టించుకోని వారు నేరుగా ఆర్డీవో కార్యాలయంలో తనను సంప్రదించాలని ఆయన సూచించారు.

వరంగల్‌లో జాతీయ మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలి

మంగపేట, మార్చి 3 : వరంగల్ కేంద్రంగా జాతీయ మిర్చి బోర్డు ఏర్పాటు చేసి, క్వింటాకు రూ.20వేల మద్దుతు ధర కల్పించి, ప్రభుత్వమే కొనుగోలు చేయాలని జాతీయ మిర్చి టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యుడు నాసిరెడ్డి సాంబశివరెడ్డి కోరారు. సోమవారం ఆకినేపల్లి మల్లారంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పది రోజులుగా మిర్చి ధర భారీగా తగ్గడం తీవ్ర విచారకరమన్నారు. ఇటీవల జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో మిర్చి రైతుల సమస్యలు తెలుసుకొని వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్, స్పైసెస్ బోర్డు అధికారుల దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. ఈ నెలలో మిర్చి ధర పెరగవచ్చని కేంద్ర వాణిజ్య శాఖ అంచనా వేస్తున్నదన్నారు. జాతీయ పసుపు బోర్డు తరహాలోనే వరంగల్‌లో జాతీయ మిర్చి బోర్డు మంజూరు చేయాలని ఆయన కేంద్రాన్ని కోరారు. ప్రస్తుత సీజన్‌లో మార్కెట్ పరంగా మిర్చి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరలోనే సీఎం, గవర్నర్, కేంద్ర, రాష్ట్ర మంత్రులను కలిసి విన్నవిస్తానని తెలిపారు.

కోటగుళ్లకు బంగారు ఆభరణాలు అందజేత

గణపురం, మార్చి 3 : కాకతీయుల కళా క్షేత్రం గణపేశ్వరాలయం కోటగుళ్లకు రూ.1.21లక్షల విలువైన రెండు బంగారు ఆభరణాలను ఎన్ఆర్ఐలు సోమవారం అందజేశారు. గణపురానికి చెందిన అట్టూరి జగన్‌మోహన్ రావు-ఉదయలక్ష్మి దంపతులు వారి కూతు రు, అల్లుడు అమెరికాకు చెందిన ఉయ్యూరు రామకృష్ణ-శిల్పాదరి సమకూర్చిన బంగారు ఆభరణాలను సోమవారం స్వామివారికి, అమ్మవారికి అలంకరించారు. అంతకు ముందు పూజలు చేశారు. కాగా, ఎన్ఆర్ఐ దంపతులకు కోటగుళ్ల పరిరక్షణ కమిటీ కృతజ్ఞతలు తెలిపింది.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★లేడీ టెలికాలర్స్, బ్యాగ్‌రౌండ్ పెయింటర్స్, కార్టూన్స్ వేసే ఆర్టిస్టులు వెంటనే కావలెను. సంప్రదించండి: 8074288199, హైదరాబాద్.
NT-329857

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

కుదురుపల్లి రోడ్డులో ఇసుక లారీల బెడద

- ప్రధాన రహదారి ఇరువైపులా పార్కింగ్
- తీవ్ర ఇబ్బంది పడుతున్న ప్రజలు

కుదురుపల్లి ప్రధాన రహదారిపై నిలిచి ఉన్న ఇసుక లారీలు

మహదేవపూర్(కాళేశ్వరం), మార్చి 3 : మండలంలోని కుదురుపల్లి రోడ్డులో ఇసుక లారీలతో ప్రజలు నిత్యం నరకం చూస్తున్నారు. ప్రధాన రహదారికి ఇరువైపులా వందల సంఖ్యలో ఇసుక లారీలు పార్క్ చేసి ఉండడంతో ఇతర వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రహదారికి రెండు వైపులా లారీలు నిలపడంతో కనీసం కారు కూడా వెళ్లలేని దుస్థితి నెలకొంది. సోమవారం గ్రామంలోని ప్రధాన రహదారిపై ఇసుక లారీల కారణంగా సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్ జామ్ అయింది. అత్యవసర పరిస్థితిలో హాస్పిటల్‌కు వెళ్లే రోగులు, కాళేశ్వరం వెళ్లే భక్తులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకొని ట్రాఫిక్‌ను సరిచేశారు. ఇదిలా ఉంటే రోజూ జాతీయ రహదారిపై ఇసుక లారీలను నిలపడంతో ప్రజలు గోస పడుతున్నారు. ట్రాఫిక్‌లో చిక్కుకొని ఎటు వెళ్లలేక నానా తంటాలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక క్వారీల్లో మరో దందా

మండలంలోని ఇసుక క్వారీల్లో కొందరు వ్యక్తులు మరో దందాకు తేరలేపినట్లు జోరుగా చర్చసాగుతోంది. లోకల్ పేరిట కొందరు వ్యక్తులు పదుల సంఖ్యలో ఇసుక లారీలను నిర్ధేశించిన ఎల్‌టీ రోడ్డు మార్గం నుంచి కాకుండా మండలంలోని బొమ్మాపూర్ క్రాస్ రోడ్డు నుంచి నేరుగా క్వారీ లోడింగ్ పాయింట్‌కు తరలించి సదరు లారీ డ్రైవర్లు నుంచి రూ.వెయ్యి నుంచి రూ.4వేల వరకు దండుకుంటున్నట్లు సమాచారం. భూపాలపల్లి, వరంగల్ ఇతర ప్రాంతాలకు చెందిన ఇసుల లారీలను ముందుగా లోడింగ్ పాయింట్ వద్దకు చేర్చుతూ సొమ్ము చేసుకుంటున్నట్లు తెలిసింది. గ్రామానికి చెందిన పలువురు యువకులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఆదివారం రాత్రి ఎస్సై పవన్ కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. సుమారు ఏడు లారీలను పట్టుకొని కేసు నమోదు చేశారు. ఇసుక లారీ డ్రైవర్లు నిర్ధేశించిన మార్గంలోనే క్వారీల వద్దకు వెళ్లాలని, రోడ్లపై ఇష్టారాజ్యంగా లారీలను నిలుపొద్దని సీఐ రామచంద్రరావు అన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

నర్సింహారెడ్డి, రవీందర్‌రెడ్డి, సతీశ్(ఫైల్)

భూపాలపల్లి రూరల్, మార్చి 3: రెండు బైకులు ఢీకొని ముగ్గురు యువకులు మృతి చెందిన ఘటన భూపాలపల్లి మండలం రాంపూర్ సమీపంలో సోమవారం రాత్రి జరిగింది. స్థానికులు, భూపాలపల్లి సీఐ నరేశ్‌కుమార్ కథనం ప్రకారం.. మహాముత్తారం మండలం మీనాజీపేటకు చెందిన పింగిలి రవీందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి(లడ్డు) ఇద్దరూ బైక్‌పై భూపాలపల్లి పట్టణానికి వచ్చి పని ముగించుకొని తిరిగి వెళ్తున్నారు. ఈ క్రమంలో భూపాలపల్లి మండలం పంబాపూర్ గ్రామానికి చెందిన సతీశ్ బైక్‌పై భూపాలపల్లికి వస్తుండగా రాంపూర్ సమీపంలో రెండు బైకులు వేగంగా ఢీకొనగా ఇద్దరు అక్కడికక్కడే మరణించారు. ఒకరు తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతుండగా అక్కడే ఉన్న స్థానికులు 108కు సమాచారం ఇవ్వగా అతడిని చికిత్స నిమిత్తం భూపాలపల్లి ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. విషయం తెలుసుకున్న భూపాలపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలను భూపాలపల్లి ఆసుపత్రికి తరలించారు.

పులి జాడ కోసం అడవుల్లో గాలింపు

కాటారం, మార్చి 3 : కాటారం రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరించినట్లు ఆనవాళ్లు కనిపించగా దాని జాడ కోసం సోమవారం అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పలు చోట్ల పరిశీలించారు. దామెరకుంట, గుండ్రాత్‌పల్లి, అన్నారం సమీప అటవీ ప్రాంతంలో పాదముద్రల(పగ్ మార్క్స్)ను గుర్తించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అడవుల్లోకి వెళ్లొద్దని హెచ్చరించారు. కాగా, ఫిబ్రవరి 9న రాత్రి పులి నస్తూర్‌పల్లి అడవుల్లో కనిపించగా అప్పటి నుంచి కాటారం, మహదేవపూర్ రేంజ్‌ల పరిధిలోని అడవుల్లోనే సంచరిస్తున్నది. దీంతో 20 రోజులుగా పులి ఆచూకీ కోసం అటవీశాఖ అధికారులు గాలిస్తున్నారు. పలు చోట్ల ట్రాప్ కెమెరాలు సైతం అమర్చారు. 8 నుంచి 10 బృందాలు పులి జాడ కోసం అడవుల్లో జల్లెడ పడుతున్నాయి. డిప్యూటీ ఎఫ్ఆర్వోలు సురేందర్, శ్రీనివాస్, బేస్ క్యాంప్, స్టైకింగ్ ఫోర్స్ సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్‌లో షార్ట్ సర్క్యూట్

చిట్యాల, మార్చి 3 : మండలకేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఇన్స్‌లేటర్ పేలి మంటలు వ్యాపించాయి. పెద్దగా సౌండ్ రావడంతో విద్యుత్ సిబ్బంది అక్కడి నుంచి పరుగులు తీశారు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ట్రాన్స్‌ఫార్మర్ పరికరాలు చిన్నాభిన్నమయ్యాయి. దీంతో మండలకేంద్రంతో పాటు, శివారు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ఘటన జరిగిన తీరును విద్యుత్ శాఖ ఏఈ చంద్రశేఖర్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పనులను పునరుద్ధరించినట్లు చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటర్లపై అధిక భారం పడడం వల్లే ఈ ఘటన జరిగినట్లు తెలుస్తున్నది.

పేకాటరాయుళ్ల అరెస్ట్

గణపురం, మార్చి 3 : మండలంలోని లక్ష్మీరెడ్డిపల్లిలో పేకాడుతున్న నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలిలా ఉన్నాయి.. పేకాడుతున్నారనే పక్కా సమాచారంతో భూపాలపల్లి సీసీఎస్, గణపురం పోలీసులు కలిసి సోమవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. లక్ష్మీరెడ్డిపల్లికి చెందిన మిరియాల మాధవరెడ్డి, గొర్రె రాజిరెడ్డి, మేడిపెల్లి రాజు, మొలుగూరి సమ్మయ్య, మామిడాల సాంబయ్యను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.7100 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రేఖ అశోక్ తెలిపారు.

కలప బహిరంగ వేలం

మహదేవపూర్, మార్చి 3 : మండలకేంద్రంలోని అటవీశాఖ కలప డిపోలో పట్టుబడిన కలపకు సోమవారం డీఎఫ్‌వో నవీన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ శాఖ అధికారులు బహిరంగ వేలం పాట నిర్వహించారు. మండలానికి చెందిన ఒకరు, ఇతర ప్రాంతాలను చెందిన మరో ఏడుగురు వేలంలో పాల్గొన్నారు. వేలం ద్వారా సుమారు రూ.7లక్షల ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 18న డిపోలో కలప వేలంపాట ఉంటుందన్నారు.

బాలికలకు సెల్ఫ్ డిఫెన్స్ అవసరం

వెంకటాపురం(నూగూరు), మార్చి3 : బాలికలకు సెల్ఫ్ డిఫెన్స్ ఎంతో అవసరమని సీఐ బండారి కుమార్ అన్నారు. ఇటీవల మేడారంలో జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో మండలం నుంచి 89 మంది విద్యార్థులు పాల్గొని 56 మంది గోల్డ్ మెడల్, 20 మంది సిల్వర్, 13 మంది బ్రాంజ్ మెడల్ సాధించారు. సోమవారం ఆయన పోలీస్‌స్టేషన్ ఆవరణలో వారిని అభినందించారు. కార్యక్రమంలో ఎస్సై కొప్పుల తిరుపతిరావు, మాస్టర్స్ సూర్యనారాయణ, హనుమంతు, రామారావు పాల్గొన్నారు.

బ్రాహ్మణపల్లి బీసీ కాలనీలో రోడ్లపై బురద తొలగింపు

'నమస్తే' కథనానికి స్పందన

హర్షం వ్యక్తం చేస్తున్న కాలనీ వాసులు

బురద తొలగించి శుభ్రం చేస్తున్న సిబ్బంది

మహదేవపూర్, మార్చి 3 : మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి బీసీ కాలనీలో రోడ్లపై పేరుకున్న బురదను జీపీ సిబ్బంది సోమవారం తొలగించి, శుభ్రం చేశారు. ఈ నెల 2న 'నమస్తే తెలంగాణ' దిన పత్రికలో 'బ్రాహ్మణపల్లి బీసీ కాలనీలో పారిశుధ్య లోపం' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించారు. మండల ప్రత్యేక అధికారి, డీఎల్‌పీవో వీరభద్రయ్య ఆదేశాల మేరకు కార్యదర్శి సరిత ఆధ్వర్యంలో సోమవారం జీపీ సిబ్బంది కాలనీలో రోడ్లపై ఉన్న బురద, చెత్తా చెదారాన్ని తొలగించారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

ఇసుక రవాణాను నిరంతరం పర్యవేక్షించాలి

- ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు
- భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి రూరల్, మార్చి 3 : ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు నిరంతరం పర్యవేక్షించడంతో పాటు చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయంలో అన్నారం, మేడిగడ్డ బరాజ్‌ల వద్ద ఇసుక లభ్యత, అనుమతుల కోసం ప్రతిపాదనలు ఇవ్వడం, నూతన రీచ్‌ల ఏర్పాటు, ఇసుక అక్రమ రవాణా నియంత్రణపై రెవెన్యూ, మైనింగ్, పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులులేని ఇసుక తవ్వకాలను అరికట్టేందుకు రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్, రవాణా శాఖల అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, నిరంతరం తనిఖీలు చేయాలని ఆదేశించారు. అన్నారం, మేడిగడ్డ బరాజ్‌ల్లో ఉన్న ఇసుక లభ్యతపై ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు పంపాలని, నూతన ఇసుక రీచ్‌ల ఏర్పాటుకు చర్యలు చేట్టాలని, త్వరలో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహిస్తామన్నారు. అక్రమ రవాణా జరిగితే వాహనాలను సీజ్ చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీ, మండల స్థాయిలో టాస్క్ ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, మైనింగ్ ఏడీ జయరాజు, టీజీఎండీసీ పీవో శ్రీకాంత్, డీపీవో నారాయణరావు, ఇరిగేషన్ ఈఈలు పరశురాం, యాదగిరి, తిరుపతి, ఆర్డీవో రవి, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు సాఫీగా నిర్వహించాలి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగురూరల్, మార్చి 3 : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను సంబంధిత అధికారులు విద్యార్థులకు ఆటంకాలు లేకుండా సాఫీగా నిర్వహించాలని కలెక్టర్ టీఎస్ దివాకర ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో పరీక్షల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ నెల 5 నుంచి 20వ తేదీ వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాలల్లోని జిరాక్స్ సెంటర్లను మూసివేసి, 144 సెక్షన్‌ను అమలు చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 10 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా 3,793 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. విద్యార్థుల రవాణాలో లోటు పాట్లు లేకుండా ఆర్టీసీ అధికారులు అదనపు బస్సులను నడిపించాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రశాంత వాతావరణంలో సజావుగా పరీక్షలు జరిగేందుకు అధికారులు కృషి చేయాలని, విద్యార్థులు సైతం అధికారుల సూచనలు పాటించాలని సూచించారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి చంద్రకళ, అధికారులు పాల్గొన్నారు.

పంటలకు నిరంతరం నీటి సరఫరా చేయండి

భూపాలపల్లి రూరల్/ ములుగు రూరల్, మార్చి 3 : వేసవిలో పంటలు ఎండిపోకుండా రక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్లు రాహుల్‌శర్మ, టీఎస్ దివాకర అధికారులను ఆదేశించారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి సాగు నీరు, నిరంతర విద్యుత్ సరఫరా, సంక్షేమ హాస్టళ్లలో సౌకర్యాల పరిశీలన, సింగల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం తగ్గింపు, తదితర అంశాలపై కలెక్టర్లతో సీఎస్ శాంతికుమారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్లు వేర్వేరుగా అధికారులతో మాట్లాడారు. వేసవిలో పంటలకు నీటి సరఫరా, విద్యుత్ సరఫరా నిరంతరాయంగా చేట్టాలని ఆదేశించారు. సంక్షేమ వసతి గృహాల్లో సౌకర్యాలు పరిశీలన, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం తగ్గింపు చర్యలపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలని సూచించారు. భూపాలపల్లి అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, విద్యుత్ శాఖ ఎస్ఈ మల్చూర్ నాయక్, వ్యవసాయ అధికారి విజయభాస్కర్, ఇరిగేషన్ ఈఈలు తిరుపతి, యాదగిరి బసవ ప్రసాద్, ఉద్యాన అధికారి సునీల్ పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ విజేతగా డిగ్రీ కాలేజీ జట్టు

ట్రోఫీ అందుకుంటున్న డిగ్రీ కళాశాల జట్టు

ములుగురూరల్, మార్చి 3 : ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నీ విజేతగా ములుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు విజయం సాధించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ కొప్పుల మల్లేశం సోమవారం తెలిపారు. హనుమకొండ జేఎన్ స్టేడియంలో ఎంవీఆర్ ఫౌండేషన్ సౌజన్యంతో నిర్వహించిన జిల్లా స్థాయి టోర్నమెంట్‌లో 22 జట్లు పాల్గొనగా డిగ్రీ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. దీంతో తెలంగాణ యూనివర్సిటీ వీసీ తోపుచర్ల యాదగిరిరావు చేతుల మీదుగా ట్రోఫీతో పాటు రూ.20వేల నగదు పురస్కారాన్ని అందుకున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. విజేతగా నిలిచిన జట్టును సోమవారం కళాశాల అధ్యాపకులు, ప్రిన్సిపాల్ అభినందించారు.

బిల్ట్ కార్మికుల వేతనాలు చెల్లించాలి

ములుగురూరల్, మార్చి 3 : బిల్ట్ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేశం అన్నారు. కార్మికుల డిమాండ్లపై రూపొందించిన కరపత్రాలను సోమవారం ములుగులో ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. బిల్ట్ కర్మాగారం ద్వారా 10 వేల మందికి ఉపాధి లభించిందని, 2014లో లాకౌట్ ప్రకటించకుండా ఫ్యాక్టరీని మూసివేయడంతో 650 మంది కార్మికులు ఉపాధి కోల్పోయారన్నారు. లేబర్ కోర్టు తీర్పు ప్రకారం కార్మికులకు రావాల్సిన పెండింగ్ వేతనాలతో పాటు ఇతర బెనిఫిట్స్‌ను చెల్లించాలని కోరారు. కోర్టు తీర్పునకు భిన్నంగా కార్మిక సంఘ నాయకులు యాజమాన్యంతో కుమ్మకై అనేక అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. నాయకులు స్వామి, నర్సింహ, కుమార్, వనక్క, నాంపెల్లి స్వామి ఉన్నారు.

కొత్త గనులకు మోక్షం ఎప్పుడు?

భూపాలపల్లి రూరల్, మార్చి 3 : కొత్త గనులకు మోక్షం ఎప్పుడని, పాలకుల మాటలు నీళ్ల మూటలుగా ఉన్నాయని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సింగరేణిలో 2037 నాటికి 21 గనులు మూతపడనున్నాయన్నారు. కాంగ్రెస్ నాయకులు గత ఎన్నికల్లో తమను గెలిపిస్తే సింగరేణికి పూర్వ వైభవం తీసుకొస్తామని మొసలి కన్నీరు కార్చారన్నారు. ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు కార్మికులకు ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా అమలు కాలేదన్నారు. వెంటనే ఇచ్చిన హామీల మేరకు నూతన గనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీఎస్‌యూఎస్ నాయకులు దాసరి జనార్దన్, కాసర్ల ప్రసాదరెడ్డి, నామల శ్రీనివాస్, రాళ్ల బండిబాబు, శ్రీధర్, ఎండీ సాజిత్, కే నరసింహారెడ్డి, సలీం పాల్గొన్నారు

డీసీఎంలను కంటెయినర్లుగా మార్చి..

- పశువుల అక్రమ రవాణా
- రహదారి పత్రాలు లేకుండా తరలింపు

కంటెయినర్లుగా మార్చిన డీసీఎంలు

ఏటూరునాగారం, మార్చి 3 : మూగ జీవాల అక్రమ రవాణాకు డీసీఎంలను కంటెయినర్లుగా మార్చి గుట్టు చప్పుడు కాకుండా తరలిస్తున్నారు. డీసీఎంల బాడీ ఎత్తును పెంచి టాప్‌పై నుంచి లోనికి గాలి వచ్చేలా ఐరన్ షీట్‌కు రంధ్రాలు చేస్తారు. ఇవి బయటకు కన్పించవు. వెనుకవైపు తలుపుల మాదిరి తయారు చేసి మూసేసి తాళాలు వేస్తుంటారు. దీంతో ఇందులో ఏం రవాణా అవుతున్నాయో తెలియకుండా ఉంటుంది. పోలీసులకు అనుమానం రాకుండా వ్యాపారులు జాతీయ రహదారి మీదుగా హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. బయటకు చూస్తే కంటెయినర్లలో ఏదో విలువైన సామగ్రి ఉన్నట్లుగా కన్పిస్తుంది. కానీ, వ్యాపారులు మాత్రం పశువులను కంటెయినర్లలో తరలిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్లలో పశువుల అంగడి నిర్వహిస్తుంటారు. ఇక్కడి సమీప గ్రామాలతో పాటు ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో ఉండడంతో ఎక్కువగా పశువుల విక్రయాలు కొనసాగుతున్నాయి. దీనిని ఆసరాగా చేసుకున్న వ్యాపారులు అక్కడి అంగడిలో పశువులు కొన్నట్లుగా ధ్రువీకరణ పత్రాలు సృష్టించి హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ఒక్కో కంటెయినర్‌లో పది నుంచి 15 వరకు మాత్రమే రవాణా చేయాల్సి ఉన్నప్పటికీ 35 వరకు రవాణా చేస్తున్నారు. డీసీఎంలు, టాటా ఏస్ వాహనాల్లో రవాణా చేస్తే పట్టుబడుతున్నామని, డీసీఎంలను కంటైనర్లుగా మార్చి అక్రమాలకు పాల్పడుతున్నారు. ప్రతి నెలా వందల సంఖ్యలో పశువుల రవాణాకు పాల్పడుతున్నారు. ఇదిలా ఉండగా ఆదివారం ఉదయం ఏటూరునాగారం పోలీసులు రెండు కంటైనర్లలో తరలిస్తున్న 65 పశువులను పట్టుకుని సీజ్ చేసి ఆరుగురిపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇక సోమవారం ఉదయం కూడా పోలీసులు మరో 11 పశువులను అక్రమంగా హైదరాబాద్‌కు తరలిస్తుండగా పట్టుకున్నారు.

పశువులు తరలిస్తున్న డ్రైవర్, ఓనర్‌పై కేసు నమోదు

అనుమతి లేకుండా పశువులను తరలిస్తున్న బొలేరో డ్రైవర్ మౌర్య శ్రీహరి, ఓనర్ ఇస్లావత్ బాలుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తాజుద్దీన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఐటీడీఏ కార్యాలయం ఎదుట సోమవారం తనిఖీలు జరుపుతుండగా బొలెరో వాహనంలో 11 ఎద్దులను ఒకదానిపై మరొకటి కట్టేసి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా హనుమకొండ వైపు తరలిస్తూ పట్టుబడగా డ్రైవర్, ఓనర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

వైఫల్యాలను ప్రశ్నిస్తే కేసులా ?

ములుగురూరల్, మార్చి 3 : కాంగ్రెస్ పాలన వైఫల్యాలను సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ములుగు మండలం పంచోత్కుపల్లి గ్రామానికి చెందిన మాసిపెద్ది దేవేందర్‌రావుపై హైదరాబాద్‌లో సైబర్ క్రైమ్ పోలీసులు అక్రమ కేసులు పెట్టడం సీఎం రేవంత్‌రెడ్డి దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. నిర్భందాలతో నిజాలు దాగవని, నిలదీసిన వారిపై కేసులు నమోదు చేయడం దుర్మార్గపు చర్య అన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయలేదని ప్రశ్నించినందుకు బీఆర్ఎస్ కార్యకర్తలపై కేసులు పెట్టి ఆనందం పొందడం అనేది కాంగ్రెస్ పార్టీకే చెల్లిందన్నారు. కేసులకు బయపడేది లేదని, దేవేందర్‌రావు వంటి సోషల్ మీడియా వలంటీర్లకు, పార్టీ కార్యకర్తలకు అధిష్టానం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. తమ కార్యకర్తల జోలికి వస్తే సహించేదిలేదని హెచ్చరించారు.

నియామక పత్రం అందజేస్తున్న సట్ల రవి గౌడ్

బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా భాస్కర్

టేకుమట్ల, మార్చి 3 : మండలంలోని అంకుశాపూర్ బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా గిరవెన భాస్కర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు షట్ల రవి తెలిపారు. ఉపాధ్యక్షులుగా మేకల శ్రీకాంత్, కూకట్ల రమేశ్, ప్రధాన కార్యదర్శిగా చిలుక రమేశ్, సంయుక్త కార్యదర్శులుగా బండి కుమార్, మేకల అనిల్, సహాయ కార్యదర్శులుగా